సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 19 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.062 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 52.062 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 1000, ఉత్తర కాలువకు 200, దక్షిణకాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.98,510
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,933
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,201
నవర (8 గ్రాములు)	రూ.73,608

గరిష్టం/కనిష్టం
38.2 /28.0

వాతావరణం

జిల్లాలో శనివారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. శుక్రవారం గాలిలో తేమ 69 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల కోసం మెడికల్ బోర్డు

నెల్లూరు (టౌన్‌): ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు డీఈఓ బాలాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బదిలీలకు అర్హులైన దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి పీడిత ఉపాధ్యాయులకు మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేసేలా ఉమ్మడి జిల్లాలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాధాన్యత కేటగిరీల్లో బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు సర్టిఫికెట్లు, మూడేళ్లకు సంబంధించి వైద్యం చేయించుకుంటున్న ఆధారాలు సమర్పించాలని కోరారు. నిర్దేశించిన తేదీల్లో ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్లు పొందాలని కోరారు.

వీఆర్‌కు ఇద్దరు సీఐలు



నెల్లూరు (క్రైమ్): నెల్లూరు నగరంలో పనిచేస్తున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను వీఆర్‌కు బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని నవాబుపేట, వేదాయపాళెం పోలీసుస్టేషన్ల పరిధిలో ఈ నెల 16వ తేదీ రాత్రి మద్యం మత్తులో జరిగిన స్వల్ప వివాదాలు రెండు హత్యలకు దారితీశాయి. ఈ రెండు ఘటనలకు బాధ్యులను చేస్తూ ఆయా పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్‌లు షేక్ అన్వర్‌బాషా, వి. శ్రీనివాసులరెడ్డిని వీఆర్‌కు బదిలీ చేశారు. దీంతో గురువారం అర్ధరాత్రి ఇన్‌స్పెక్టర్లు తమ విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ నేపథ్యంలో నవాబుపేట పీఎస్ ఇన్‌చార్జిగా బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె. సాంబశివరావు, వేదాయపాళెం పీఎస్ ఇన్‌చార్జిగా దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యలను నియమించారు.

రాజకీయ క్రీడలకు కమిషనర్ల బదిలీ

- గతంలోనూ టీడీపీ పాలనలో నాలుగేళ్లలో 9 మంది బదిలీ
- తాజాగా 9 నెలలకే ఒక కమిషనర్ ఔట్
- ఎమ్మెల్యే, మంత్రి మధ్య పోరులో నలిగిపోయిన వైనం
- బదిలీ చేయాలని మంత్రికి మొరపెట్టుకున్న పరిస్థితి
- నాడు సాక్షి కథనం.. నేడు నిజం

నగర పాలక సంస్థలో మంత్రి, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్యం

అధికార పార్టీలో రాజకీయ క్రీడలకు అధికారులు బలి అయిపోతున్నారు. నెల్లూరు నగర పాలక సంస్థను అడ్డాగా చేసుకుని అవినీతి, అక్రమాలు సాగించేందుకు సాగిస్తున్న కుటిల కుతంత్రానికి అధికారులు ఆర్తనాదాలు చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. కమిషనర్లుగా వచ్చే ఐఏఎస్ అధికారులు ప్రజాప్రతినిధులు చెప్పినట్లు అడ్డంగా చేసేందుకు సిద్ధంగా ఉండకపోవడంతో వారి ఆగ్రహానికి గురికాక తప్పడం లేదు. టీడీపీ హయాంలో గతంలోనూ, ఇప్పుడూ ఏ కమిషనర్ కనీసం ఏడాది పాటు కూడా పనిచేయలేక పారిపోతుండడం గమనార్హం.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు కార్పొరేషన్ అడ్డాగా ప్రజాప్రతినిధుల మధ్య జరుగుతున్న కోల్డ్ వార్ అధికారులకు శిరోభారంగా మారింది. ఆధిపత్యం, స్వలాభం కోసం మంత్రి, ఎమ్మెల్యే మధ్య ఆధిపత్య పోరుకు అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రోటోకాల్ ప్రకారం తన ఆదేశాలు పాటించాలంటూ మున్సిపల్ శాఖ మంత్రి.. తన నియోజకవర్గానికి సంబంధించిన కార్యకలాపాల్లో తన పెత్తనమే కొనసాగాలని ఎమ్మెల్యే మంకుపట్టు పడుతున్నారు. నెల్లూరు నగర పాలక సంస్థలో మంత్రి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మధ్య జరుగుతున్న రాజకీయ క్రీడలకు అధికారులు క్లీన్ బౌల్డ్ అవుతున్నారు. 'విడవ మంటే పాముకు కోపం.. కరవమంటే కప్పకు కోపం' అన్నట్లుగా ఆ ఇద్దరు ప్రజాప్రతినిధుల ఆధిపత్య పోరులో అధికార యంత్రాంగం నలిగిపోతోంది. ఎవరికి వారే నా మాటే చెల్లుబాటు కావాలంటూ పొలిటికల్ గేమ్ ఆరంభించడంతో విసిగిపోయిన కమిషనర్ బతుకు జీవుడా అంటూ బదిలీపై వెళ్లాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల వ్యవధిలోపే యువ ఐఏఎస్ అధికారిని బలిపశువు చేయడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఎందుకీ ఆధిపత్యం

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో నగర నియోజకవర్గంతో పాటు నెల్లూరు రూరల్ నియోజకవర్గం కూడా సమాన ప్రాతినిధ్యం ఉంది. ప్రోటోకాల్ ప్రకారం మున్సిపల్ శాఖ మంత్రిగా, సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న నారాయణ మాటే ప్రస్తుతానికి చెల్లుబాటు అవుతోంది. మంత్రి నారాయణ కార్పొరేషన్‌ను పూర్తి స్థాయిలో తన స్వాధీనంలోకి తీసుకుని అధికారుల బదిలీల నుంచి ప్రతి విషయంలో తల దూర్చుతున్నారు. ఈ పరిణామాలు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి రుచించడం లేదు. కార్పొరేషన్‌లో కర్ర పెత్తనం కోసం ఇద్దరి మధ్య వార్ నడుస్తోంది. ప్రతిదీ కార్పొరేషన్‌తో ముడిపడి ఉంటుంది. ఆర్థిక అవసరాలు కూడా కార్పొరేషన్ ద్వారానే సమకూరుతాయి. ప్రధానంగా తమ తమ నియోజకవర్గాల పరిధిలో నగరాభివృద్ధి తమ కనుసన్నల్లోనే జరగాలని ప్రజాప్రతినిధులు భావిస్తారు. తద్వారా రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు దక్కించుకోవాలని అనుకుంటారు. ప్రస్తుతం నగరాభివృద్ధి మొత్తం శివారు ప్రాంతాల్లోనే జరుగుతోంది. రియల్ వెంచర్లు, భవన నిర్మాణాలకు అనుమతులు అన్నీ కార్పొరేషన్ కనుసన్నల్లోనే జరగాల్సి ఉంది. ఈ క్రమంలో కర్ర పెత్తనం మంత్రి తీసుకోవడంతో ఈ పరిణామాలు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేకు ఇబ్బందిగా మారాయి. ఏ పనుల విషయంలో కూడా ఎమ్మెల్యే మాట సాగడం లేదు. గతంలో ఎమ్మెల్యే అనుచరులు, ఆయన కనుసన్నల్లోనే అనధికార లేఅవుట్‌లు వేశారు. దీంతో మంత్రి నారాయణ అనధికార లే అవుట్లపై కన్నెర్ర చేశారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోనే ఇలాంటి లేఅవుట్లు 230 వరకు ఉన్నాయని తేల్చారు. అప్రూవల్ లే అవుట్లను ఆన్‌లైన్‌లో ఉంచుతామని, వాటినే కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే.. కొత్తగా నుడా చైర్మన్ అయిన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి 'నా సంగతేంటి అంటూ అనధికార లే అవుట్ల యజమానులకు సందేశాలు పంపుతున్నారు. నా సంగతి చూడకుంటే.. మీ లేఅవుట్ల భరతం పడతానంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఈ పరిణామాలు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డికి తలనొప్పి పుట్టిస్తున్నాయి. దీంతో మంత్రి నారాయణ తీరును పలుమార్లు బహిరంగం గానే ఎండగట్టారు. మా జోలికొస్తే రోడ్డెక్కుతానని వార్నింగ్ ఇచ్చారు. మంత్రి నారాయణ మాత్రం కోటంరెడ్డి మాటలను పెద్ద గా పట్టించుకోవద్దని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. దీనికి తోడు షాడో మంత్రిగా వ్యవహరిస్తున్న ఓ నేత కార్పొరేషన్ అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాల్లో తలదూర్చుతున్నాడు. ప్రతిదీ తనకు తెలపాల్సిందే అని ఆదేశాలు ఇచ్చారని సమాచారం.


అధికారుల ఆర్తనాదాలు

బదిలీ కోరుతున్న ముఖ్యశాఖల అధికారులు.. నెల్లూరు కార్పొరేషన్‌లో పతాక స్థాయికి ఆధిపత్య పోరు

ఎందుకీ ఆధిపత్య పోరు?

ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనం

ఏడాది కంటే ఎక్కువ లేని కమిషనర్లు

2014–19 మధ్య ఐదేళ్ల కాలంలో నాలుగేళ్ల వ్యవధిలో 9 మంది కమిషనర్లు బాధ్యతలు స్వీకరించడం, ఏడాది తిరగకుండానే బదిలీ అయిపోవడం జరిగింది. ఈ పరిణామాలు అప్పట్లో ఐఏఎస్‌ల్లోనే చర్చనీయాంశమైంది. నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్లుగా వచ్చేందుకు ఎవరూ మొగ్గు చూపేవారు కాదు. అనివార్య పరిస్థితుల్లో వచ్చినా.. కొద్ది రోజులకే చివరాఖరుకు అప్రాధాన్యం పోస్టుల్లోకి వెళ్లడానికి కూడా వెనుకాడే వారు కాదు. తాజాగా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గత కమిషనర్‌ను బదిలీ చేసింది. ఆ స్థానంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సూర్యతేజ తొమ్మిది నెలలు తిరగకుండానే బదిలీపై వెళ్లిపోవడంతో చర్చనీయాంశమైంది.

నెల్లూరు రూరల్ అభివృద్ధి పనులకు నిధులు

నెల్లూరురూరల్ పరిధిలో తాజాగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బడ్జెట్ కేటాయింపులు, కౌన్సిల్ అనుమతి లేకుండానే 302 పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆయా పనులకు కార్పొరేషన్ జనరల్ ఫండ్ ద్వారా దాదాపు రూ.26 కోట్లు మంజూరు చేసేలా ఒత్తిడి తెచ్చి పంతం నెగ్గించుకున్నారు. అన్ని పనులు ఒకే సారి చేస్తున్నట్లు రాష్ట్ర స్థాయిలో ప్రచారం చేయించాడు. అదే కార్పొరేషన్‌లో ఉండే నగర నియోజకవర్గంలో మాత్రం జనరల్ ఫండ్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు జరగడం లేదనే విమర్శలు లేకపోలేదు. ఆ శాఖ మంత్రిగా ఉండి కూడా అభివృద్ధి పనులు జరగకపోవడంపై పెద్ద చర్చనీయాంశమైంది. ఇటీవల చెత్త ఎత్తుకెళ్లేట్రాక్టర్లకు రూ.కోట్ల రూపాయలతో టెండర్లు జరిగాయి. ఆయా టెండర్లలో కూడా షాడో మంత్రి సూచించిన వారికే ఇవ్వాలని పట్టుబట్టారు. కానీ ఎమ్మెల్యే కోటంరెడ్డి అడ్డుపడి తన నియోజకవర్గంలో తన అనుచరుడికి ఇప్పించాడు. కార్పొరేషన్‌లో శాఖాపరమైన బదిలీల వ్యవహారంలో కూడా మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే వార్ నడిచింది. ఇందులో కూడా కమిషనర్ నిలిగిపోయాడు. నిత్యం ఆ ఇద్దరి ప్రజాప్రతినిధులతో పాటు షాడో మంత్రి మధ్య నిలిగిపోయిన కమిషనర్ మానసిక వేదన భరించలేక బదిలీ చేయమని గతంలో మంత్రి వద్ద వాపోయిన విషయం తెలిసిందే. అప్పట్లో 'సాక్షి'లో ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ 'అధికారులు ఆర్తనాదాలు' శీర్షికతో కథనం ప్రచురితం కావడం పెద్ద సంచలనమే రేగింది. అప్పట్లో రాజకీయవర్గాల్లో చర్చగా మారింది. తాజాగా కమిషనర్ బదిలీతో ఆ కథనం వాస్తవమే అని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

ముస్లింల ద్రోహి చంద్రబాబు

- ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకు ముస్లింలు గుర్తుకొస్తారు
- ముస్లింలకు అండగా నిలిచిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్
- వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిద్ధిఖ్
- జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కందుకూరు: ఎన్నికల ముందు ముస్లింలకు అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ అబద్ధపు హామీలివ్వడం. ఆ తర్వాత ముస్లిం సమాజాన్ని మోసం చేయడం సీఎం చంద్రబాబుకు వెన్నుతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిద్ధిఖ్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు విషయంలో ముస్లింలపై చంద్రబాబు వైఖరి మరోసారి రుజువైందన్నారు. చంద్రబాబుకు ముస్లింలు అంటే గిట్టదని, వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తారని చెప్పారు. చంద్రబాబు మద్దతు లేకపోతే ఈ బిల్లు ఆమోదం పొందేది కాదన్నారు. అదే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ తరఫున బిల్లును వ్యతిరేకించి ముస్లింలకు అండగా నిలిచారన్నారు. సుప్రీంకోర్టులో చట్టానికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్నారని గుర్తు చేశారు.

వక్ఫ్ చట్టంపై సుప్రీంలో న్యాయం

వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా దేశం మొత్తం ప్రస్తుతం ఆందోళనలు జరుగుతున్నాయని, సుప్రీంకోర్టులో ముస్లింలకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అన్ని విధాలా ముస్లింలను మోసం చేస్తున్న చంద్రబాబును ముస్లిం సమాజం పూర్తిగా వ్యతిరేకించాలన్నారు. ఏ ఒక్క విషయంలో కూడా చంద్రబాబు ముస్లింలకు అండగా నిలవలేదని గుర్తు చేశారు. అదే జగన్‌మోహన్‌రెడ్డి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు రూ. 83 వేల ఆర్థిక సాయం అందించారని, ఆయన తండ్రి రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించి అన్ని విధాలా అండగా నిలిచారని వివరించారు.

చట్టాన్ని ప్రతి ముస్లిం వ్యతిరేకించాలి

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఫజుల్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు ఇచ్చిందని, వైఎస్సార్ సీపీ వ్యతిరేకించిందని తెలిపారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం వల్ల ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని వివరించారు.

జగనన్నకు కృతజ్ఞతలు

వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫి మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం విషయంలో కూటమి ప్రభుత్వం ఆడుతున్న నాటకాలను ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. ఇప్పటికైనా ముస్లింలు కూటమి ప్రభుత్వ నిజ స్వరూపాన్ని తెలుసుకోవాలని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా ముస్లింలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ సంధాని, సుల్తాన్, రహీం, ఖాదర్‌బాషా, జుబేర్, దస్తగిరి, బాబు, అన్వర్, మస్తాన్‌లి, మునీర్, షాకీర్, ఖాజాహుస్సేన్, అయూబ్‌ఖాన్, జిలాని, కరిముల్లా షా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

- ప్రత్యేకాధికారి డాక్టర్ ఎస్ యువరాజ్


మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ యువరాజ్

నెల్లూరు రూరల్: వినూత్న ఆలోచనలు, టీం వర్క్‌తో జిల్లా అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఎస్ యువరాజ్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు నియమించిన జిల్లా ప్రత్యేకాధికారి, పరిశ్రమలు, వాణిజ్యశాఖల కార్యదర్శి యువరాజ్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఓ ఆనంద్ వివిధ రంగాల్లో జిల్లా పురోగతిని వివరించారు. ప్రత్యేక అధికారి యువరాజ్ మాట్లాడుతూ జిల్లాలో వనరులను, ప్రజావసరాలను గుర్తించి అన్ని స్థాయిల్లో డేటాను అనుసంధానం చేసి అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన ద్వారా మాత్రమే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. కింది స్థాయిలో అధికారులు చేసిన ప్రయోగాల ద్వారా మాత్రమే ఉన్నతంగా తీర్చిదిద్దుతాయన్నారు. జిల్లాలోని అధికారులతో స్ట్రాటజిక్ కోర్ గ్రూప్‌ను తయారు చేసి ప్రజావసరాలను తెలుసుకుని, అందుబాటులో ఉన్న వనరులతో జిల్లాను అన్ని రంగాల్లో అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. టూరిజం పరంగా జిల్లాను అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. జిల్లాలోని పుణ్యక్షేత్రాలు, బీచ్, ఇతర ప్రముఖ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ టూరిజం ప్యాకేజీ నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. నేటి యువత ట్రెక్కింగ్ చేసేందుకు ఆసక్తిగా ఉన్న దృష్ట్యా అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్‌కు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఎంటర్ ప్రెన్యూర్‌గా మారేందుకు తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా జీడీపీ పెరిగేందుకు సర్వీస్ సెక్టార్‌లోని అగ్రికల్చర్, హార్టికల్చర్ తదితర రంగాల్లో వృద్ధి సాధించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు చేయూతనిస్తూ, వెనుకబడిన వాటిని ప్రోత్సహించాలన్నారు. టిడ్కో గృహాల్లో ఎక్కువ మంది చేరే విధంగా, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళలు రొటీన్‌గా చేసే ఉత్పత్తులు కాకుండా కొత్త ఉత్పత్తులపై దృష్టి పెట్టే విధంగా మెప్మా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కె కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్‌ఓ ఉదయభాస్కర్ రావు, ఆర్డీఓలు అనూష, వంశీకృష్ణ, పావని, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హోటల్ ఫుడ్.. రోగం ఫ్రీ

ఘుమఘుమలాడే వాసన, ఆకర్షించే రంగులతో వండి వార్చిన చికెన్, మటన్, చేపలు కనిపిస్తే చాలు లొట్టలేసుకుంటూ తింటాం. బిర్యానీ ప్రేమికులు ఇంకాస్త ఎక్కువ. హోటల్‌లో తిన్న పాపానికి హాస్పిటల్‌కి వెళ్లాల్సి వస్తోంది. హోటల్ బిల్లు ఒక షాక్ అయితే, ఆస్పత్రి బిల్లు ఇంకో షాక్. హోటళ్లలో వాడుతున్న నాసిరకం ఆహార పదార్థాల ముడిసరుకులు, అపరిశుభ్రత వాతావరణం, మంచి నీళ్లు వాడకపోవడం, ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన పదార్థాలు వండడం వంటి కారణాలతో ఫుడ్ పాయిజనింగ్ కేసులు తీవ్రమవుతున్నాయి.

- నాణ్యత లేని, నిల్వ పదార్థాలతో ఆహారాలు తయారీ
- పదే పదే నూనెలు మరిగిస్తూ ఆరోగ్యంతో చెలగాటం
- కంపు కొడుతున్న కిచెన్‌లు.. ఫుడ్ పాయిజనింగ్‌తో బెంబేలు
- ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తున్నా మార్పేదీ?
- 290 శాంపిళ్లు టెస్ట్ చేయగా 12 శాంపిళ్లు హానికరమని వెల్లడి


నగరంలోని ఓ హోటల్లో తనిఖీ చేస్తున్న ఆహార భద్రతా అధికారులు (ఫైల్)

నెల్లూరు (బారకాసు): జిల్లాలో పెద్ద హోటళ్లు వందకు పైగా ఉన్నాయి. చిన్న చిన్నవి మరో 200కు పైనే ఉంటాయి. వీధుల్లో అమ్ముతున్న ఆహార బండ్లకు లెక్కేలేదు. ఇక్కడ వాడే నూనెలు, కూరల్లో వేసే రంగులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ప్రధానంగా మాంసం, చికెన్, చేపలు, రొయ్యలు వంటి పదార్థాలు నాలుగైదు రోజులైనా నిల్వ ఉంచి వినియోగదారులకు పెడుతున్నారు. హోటల్ ఫుడ్ తింటే.. రోగం ఫ్రీ అన్నట్లుగా పరిస్థితి ఉంది. చాలా హోటళ్లు, టిఫిన్ సెంటర్లకు లైసెన్స్‌లు లేకపోవడం గమనార్హం.

కేసులు, జరిమానాలు.. అయినా మార్పేది?

జిల్లాలోని నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తున్న హోటల్స్‌పై ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేసి వ్యాపారస్తులపై కేసులు నమోదు చేశారు. అందులో నగరంలోని ఓ హోటల్లో తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు లేకుండా వినియోగదారుడికి ఐస్‌క్రీం అందిస్తున్నట్లు గుర్తించి రూ.10 వేలు జరిమానా విధించారు. ఆత్మకూరులో ఓ రెస్టారెంట్‌లోని వంట గదిలో ఏ విధమైన తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు లేని నూడిల్స్ విక్రయిస్తుండగా రూ.10 వేలు, పలు రకాలైన బ్రాండ్లతో గోలీసోడాలు తయారు చేస్తూ ఏ విధమైన తేదీలు, బ్యాచ్ నంబర్లు లేకుండా ప్రజలకు విక్రయిస్తున్న నాలుగు గోలీసోడా యూనిట్ల యజమానులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు, నగరంలోని మాగుంటలే అవుట్‌లో కాంఫెక్షనరీ షాపులో సబ్‌స్టాండర్డ్ కోకోనట్ మిల్క్‌ను విక్రయిస్తున్నందుకు రూ.25 వేలు, స్టోన్‌హౌస్ పేటలో నాణ్యతలేని సబ్ స్టాండర్డ్ కారంపొడి విక్రయిస్తున్న షాపు యజమాని, తయారీదారుడికి రూ.10 వేలు, వంట నూనె లూజుగా విక్రయిస్తున్న 3 షాపుల యజమానులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున జరిమానా విధించారు.

12 శాంపిళ్లు అనారోగ్యంగా గుర్తింపు

గడిచిన ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు పలు హోటల్స్‌లో తనిఖీ చేపట్టి మొత్తం 290 శాంపిల్స్‌ను సేకరించారు. వీటిని ల్యాబ్‌కు పంపించగా 12 శాంపిల్స్ ఆరోగ్యానికి హానికరమని, అలాగే 22 నాణ్యత లేని ఆహారంగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఏ హోటల్లో అయితే గడువు ముగిసిన, నిల్వ ఉంచిన ఆహారా పదార్థాలను అధికారుల తమ పరిశీలనలో గుర్తించారో అటువంటి హోటల్స్‌పై మొత్తం 15 క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు రూ.1.45 లక్షలు జరిమానా విధించారు.

- నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో ఓ చిన్న రెస్టారెంట్‌కు లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఇటీవల కుటుంబంతో కలిసి వెళ్లి భోజనం చేశారు. ఇంటికొచ్చిన గంటన్నరకే కడుపులో వికారం. కొద్ది సేపటికే వాంతులు, విరేచనాలు. దీంతో ఆస్పత్రికి పరుగు తీయగా, ఫుడ్ పాయిజనింగ్ అని డాక్టర్ తేల్చి చెప్పారు.
- నగరానికి చెందిన మురళి కావలిలోని మెయిన్‌రోడ్డులో ఉన్న ఓ నాన్‌వెజ్ రెస్టారెంట్‌కు వెళ్లాడు. చికెన్ తిన్న అతనికి నాలుగు గంటల తర్వాత తీవ్ర కడుపు నొప్పి వచ్చింది. వెంటనే నెల్లూరులోని పొగతోటలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటే కానీ పరిస్థితి కుదుట పడలేదు.
- ఇటీవల ఓ వ్యక్తి అల్పాహారం తినేందుకు నగరంలోని ప్రముఖ హోటల్‌కు వెళ్లి ఇడ్లీ ఆర్డర్ చేశాడు. ఆ ప్లేటులో బొద్దింక ఉండడాన్ని కస్టమర్ గుర్తించి సర్వ్ చేసిన వ్యక్తితోపాటు హోటల్ నిర్వాహకుడిని ప్రశ్నించినా పట్టించుకోకపోవడంతో అతను ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం విదితమే.

బయట ఆహారాన్ని తగ్గించాలి



బయట తయారు చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు హోటళ్లు, రెస్టారెంట్ల ఆహారాన్ని తగ్గించడమే మేలు. అతిగా వినియోగించిన నూనెతో చేసే వంటకాలు తీసుకోవడం వల్ల శరీరంలో కేన్సర్ కారకాలు వృద్ధి చెందే అవకాశం లేకపోలేదు. రోడ్లపై దొరికే ఆహార పదార్థాలతో అజీర్తి, ఇతర గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తుతాయి.

– డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, పల్మనాలజిస్ట్, ప్రభుత్వ విశ్రాంత వైద్యుడు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



విధిగా హోటల్స్‌పై తనిఖీలు చేస్తున్నాం. అపరిశుభ్రంగా ఉండే హోటళ్లపై కేసులు నమోదు చేస్తున్నాం. ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన ఆహారం, పారిశుద్ధ్యం సరిగా లేకపోవడంపైనే దృష్టి సారించాం. ముఖ్యంగా చికెన్, మటన్ వంటి వాటిపై ప్రమాదకర రంగులు వేయొద్దని సూచిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే భారీగా జరిమానాలు విధిస్తాం.

– వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్

క్లుప్తంగా

యాదవ ఎంప్లాయీస్ సొసైటీ భవన ప్రారంభం



నూతన కార్యవర్గం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మినీబైపాస్‌లోని పూలే సెంటర్ వద్ద యాదవ ఎంప్లాయీస్ సొసైటీ నూతన భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఏపీ స్టేట్ గెజిటెడ్ జేఏసీ అధ్యక్షుడు కృష్ణయ్య, అసెంబ్లీ చీఫ్ మార్షల్ గణేష్‌బాబు, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ హాజరయ్యారు. అనంతరం కృష్ణసాయి కన్వెన్షన్లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, దయాకర్, గురుప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులుగా ప్రవీణ్‌కుమార్, వినయ్, సురేష్ బాబు, బలరామ్, శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులుగా మురళి, సుకుమార్, జగదీష్, కొండయ్య, గురవయ్య, కార్యాలయ ఇన్‌చార్జిలుగా కేశవకుమార్, జయరామయ్య, లోకేశ్ తదితరులను ఎన్నుకున్నారు.

వెంకన్నపాలెం తీరంలో షిప్ పరికరం



తోటపల్లిగూడూరు: మండలంలోని వెంకన్నపాళెం సముద్ర తీరానికి గురువారం రాత్రి షిప్ పరికరం కొట్టుకొచ్చింది. దీనిని గుర్తించిన స్థానిక మత్స్యకారులు జేసీబీతో ఒడ్డుకు చేర్చారు. భారీ స్థాయిలో ఉన్న దానిని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. సమాచారం అందుకున్న మెరైన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అది షిప్‌కు ఇంధనం ఎక్కించే ఆయిల్ ట్యాంకర్‌గా వారు నిర్ధారణకు వచ్చారు. ఈ సందర్భంగా మెరైన్ పోలీసులు మాట్లాడుతూ రాకెట్ శకలమంటూ పుకార్లు వచ్చాయని, అందులో వాస్తవం లేదన్నారు. ఉన్నతాధికారుల సూచనలతో దానిని జిల్లా కేంద్రానికి తరలిస్తామన్నారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి



చికిత్స పొందుతున్న పెంచలయ్య

పొదలకూరు: పట్టణానికి సమీపంలోని లింగంపల్లి తోపులో ఓ వ్యక్తిపై అదే ప్రాంతానికి చెందిన వారు పాతకక్షలను మనసులో పెట్టుకుని కళ్లలో కారం చల్లి దాడికి పాల్పడ్డారు. పోలీసులు, బాధితుడి కథనం మేరకు వివరాలు.. గురువారం రాత్రి పిల్లిపోగు పెంచలయ్య భోజనం చేసి ఇంటి బయట తిరుగుతుండగా చిన్నా, సంపూర్ణ దంపతులు పథకం ప్రకారం కళ్లలో కారం చల్లి దాడికి పాల్పడ్డారు. అల్యూమినియం బీడింగ్‌తో తలపై కొట్టడంతో పెంచలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఎస్‌కే హనీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్లూరులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు




ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

అల్లూరు: మండలంలోని అల్లూరుపేట సత్రంలో ఉన్న గంగమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల ఉత్సవం సందర్భంగా పీజీఎం యూత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలను శుక్రవారం అల్లూరులో నిర్వహించారు. కోవూరుకు చెందిన శ్రీచెన్నకేశవ స్వామి ఎద్దు మొదటి బహుమతి, పాట్టిపాళెం గ్రామానికి చెందిన వరసిద్ధి వినాయక స్వామి ఎద్దు రెండో బహుమతి, కోవూరుకు చెందిన కర్లగుంట ప్రభాకర్ ఎద్దు మూడో బహుమతి, పాటూరు గ్రామానికి చెందిన ఎద్దు నాలుగో బహుమతి, యల్లాయపాళెం గ్రామానికి చెందిన ఎద్దు ఐదో బహుమతిని గెలుచుకున్నాయి. ప్రథమ బహుమతి రూ.25,116లను చిల్లంకూరు చంద్రశేఖరరెడ్డి, ద్వితీయ బహుమతి రూ.20,116లను కడివేటి హజరత్‌రెడ్డి, మూడో బహుమతి రూ.15,116లను వేగూరు అన్వేష్, నాలుగో బహుమతి రూ.10116లను అళహరి రామారావు, ఐదో బహుమతి రూ.7,116లను గుండాల గోపాలయ్య అందజేశారు. కార్యక్రమంలో అల్లూరుపేట సత్రం ఎడ్ల బండ్ల కమిటీ సభ్యులు, పీజీఎం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కాలేయం.. కాపాడుకుందాం

నేడు వరల్డ్ లివర్ డే



- ఊబకాయం, మారిన ఆహార అలవాట్లు, జీవనశైలితో పొంచిఉన్న ముప్పు
- జిల్లాలో 3 లక్షల మందికి ఏదో ఒక రకమైన సమస్య
- హెపటైటిస్ బీ, సీ వైరస్‌లతో మరింత డ్యామేజీ
- 2025 సంవత్సర థీమ్ 'ఆహారమే ఔషధం'

నెల్లూరు(అర్బన్): కాలేయం (లివర్).. మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. ఆహారం జీర్ణమై చివరికి పిండి పదార్థాలుగా, కొవ్వు ఆమ్లాలుగా, ప్రోటీన్లుగా మారి రక్తంలో కలవాలంటే ఇది సక్రమంగా పని చేయాలి. అయితే మారిన ఆహార అలవాట్లు, జీవనశైలి వల్ల లివర్ అనారోగ్యానికి గురవుతోంది. హెపటైటిస్ బీ, సీ వైరస్‌ల వల్ల కూడా పాడవుతోంది. సిర్రోసిస్ ఆఫ్ లివర్‌గా మారితే రూ.20 లక్షలకు పైగా ఖర్చు చేసి కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేయించుకోవాలి. దానం చేసే వారు కూడా అందుబాటులో ఉండాలి. లేదా బ్రెయిన్ డెడ్ అయ్యి అవయవ దానం చేసేవారు ఉండాలి. లేకుంటే ప్రాణాలు పోతాయి. ఈ పరిస్థితిని గుర్తించి ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 19వ తేదీని కాలేయ దినోత్సవంగా ప్రకటించింది. శనివారం జిల్లాలో వైద్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాలేయం శరీరంలో అతి పెద్ద గ్రంథి. మెదడు తర్వాత అతి ప్రధానమైన అవయవం. రక్తాన్ని ఫిల్టర్ చేయడంలో సాయపడటం, విటమిన్ డీని శరీరానికి అందేలా చూడటం, చక్కెర స్థాయిని సమతుల్యం చేయడం, ఆహారాన్ని జీర్ణం చేయడం, ఖనిజ లవణాలను, విటమిన్లను నిల్వ చేయడం లాంటి పనులు చేస్తోంది. ఆరోగ్య సమస్యలు ఎక్కువ కాలం కొనసాగితే హెపటైటీస్, సిర్రోసిస్, కామెర్లు, కేన్సర్ లాంటి తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల లివర్‌ను మంచి ఆహారపు అలవాట్లతో కాపాడుకోవాలి.

జిల్లాలో ఇలా..

జిల్లాలో సుమారు 30 లక్షల జనాభా ఉండగా అందులో వివిధ రకాల కాలేయ సమస్యలతో బాధపడేవారు సుమారు 3 లక్షల మంది ఉన్నట్లు అంచనా. అతిగా తినడం, శారీరక శ్రమ లేకపోవడం, కుర్చీలకు పరిమితమై పనులు చేస్తున్న వారికి ఊబకాయం వస్తోంది. ఇలా ఉన్న వారిలో ఫ్యాటీ లివర్ సమస్యలున్నాయి. ఇది ఉన్నట్టు చాలామందికి తెలియదు. తక్కువ మందిలో జన్యుపరమైన అంశాలు కూడా ఫ్యాటీ లివర్‌కు కారణమవుతున్నాయి. స్కానింగ్ చేయించుకుంటేనే తెలుస్తుంది.

ప్రభుత్వ పెద్దాస్పత్రిలో..

నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో హైపటైటిస్ బీ, సీ వైరస్ కేసులు ప్రతి సంవత్సరం వందల్లో నమోదవుతున్నట్టు తెలిసింది. 2021 సెప్టెంబర్ నుంచి 2025 మార్చి నెల వరకు 73,832 మందికి డాక్టర్లు స్క్రీనింగ్ పరీక్షలు రాశారు. వారిలో 1,275 మందికి హైపటైటిస్ బీ ఉంది. అలాగే 53,575 మందికి పరీక్షలు నిర్వహించగా 136 మందికి హెపటైటిస్ సీ అనే జబ్బు ఉంది. వీరు కాకుండా 686 మంది డయాలసిస్ రోగులను పరీక్షించగా ముగ్గురు హెపటైటిస్ బీ బారిన, 13 మంది సీ బారిన పడ్డారు. 8,885 మంది హెచ్‌ఐవీ రోగులను పరిశీలించగా 255 మంది బీతో, ముగ్గురు సీతో ఉన్నారు. జిల్లా సెంట్రల్ జైల్‌కు సంబంధించిన 2,709 మంది ఖైదీలకు పరీక్షలు చేయగా 12 మంది బీ వైరస్‌తో, 8 మంది సీ వైరస్‌తో బాధపడుతునట్లు తేలింది. ఇక ప్రైవేట్ ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో స్క్రీనింగ్ చేయిస్తే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది.

60 మందికి పైగా లివర్ మార్పిడి

జిల్లాలో లివర్ డ్యామేజైన వారు ఇప్పటికే 60 మందికి పైగా దాతల సాయంతో మార్పిడి చేయించుకుని జీవిస్తున్నారు. కాలేయం కొంచెం దానం చేస్తే సరిపోతుంది. మళ్లీ పూర్తి స్థాయిలో ఏర్పడుతుంది. అందువల్ల లివర్ మార్పిడిపై అపోహాలు వీడాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఇటీవల కూడా పలువురు రక్త సంబంధీకుల ద్వారా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నారు. నెల్లూరు స్టోన్‌హౌస్ పేటకు చెందిన సత్యనారాయణ అనే వ్యక్తికి ఆయన తమ్ముడు లివర్‌ను దానం చేశాడు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. ఏసీనగర్‌కు చెందిన ఓ మహిళకు ఆమె కుమార్తె, పొదలకూరు దగ్గర నివాసం ఉంటున్న ఓ వ్యక్తికి ఆయన భార్య లివర్‌ను దానం చేశారు. ఇలాంటి వారు చాలామంది ఉన్నారు.

సమతుల్య ఆహారం తీసుకోవాలి



ఆహారం ద్వారానే ఎక్కువగా లివర్ సమస్యలు వస్తున్నాయి. ప్రాసెస్డ్, ఫ్రిడ్జ్‌లో ఉంచే ఆహారం, బేకరీ ఫుడ్స్ మానాలి. చిన్నపిల్లలకు మంచి ఆహారంపై అవగాహన కల్పించాలి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎ) సూచించిన ప్రకారం సమతుల్య ఆహారం తీసుకుంటే లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. హెపటైటిస్ సీకి ఇప్పుడు వైద్యం ఉంది. పెద్దాస్పత్రిలో చికిత్స పొందిన వారందరూ కోలుకున్నారు. హెపటైటిస్ బీకి పూర్తి చికిత్స లేకున్నా నియంత్రణకు నాలుగు సంవత్సరాలు మందులు వాడాలి. ఊబకాయం రాకుండా చూసుకోవాలి.

– డాక్టర్ సునీల్, అసోసియేట్ ప్రొఫెసర్, హెపటైటిస్ నోడల్ ఆఫీసర్, సర్వజన ఆస్పత్రి

ఆహారం విషయంలో జాగ్రత్త



పండ్లు, కాయగూరలు, ఆకుకూరలు, పప్పులు, పాలు తీసుకుంటే మంచిది. మితంగా భుజించాలి. శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవాలి. షుగర్, బీపీ ఉన్న వారు అప్పుడప్పుడూ లివర్ పరీక్షలు చేయించుకుని డాక్టర్ సలహాలు పాటించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది ఆహారమే ఔషధం అనే థీమ్‌ను ప్రకటించింది.

తాళం వేస్తే.. ఇల్లు గుల్లే



గత నెలలో బుజబుజనెల్లూరు ఆర్టీసీ కాలనీలోని ఇంట్లో దొంగలు చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు



కావలిలో వివరాలు సేకరిస్తున్న వన్ టౌన్ సీఐ ఫిరోజ్ (ఫైల్)

- జిల్లాలో పెరిగిన చోరీలు
- నిర్లక్ష్యమూ కొంతమేర కారణమే..
- నెలన్నర వ్యవధిలో రూ.1.50 కోట్లకు పైగా అపహరణ
- వరుస ఘటనలతో జనం బెంబేలు

నెల్లూరు(క్రైమ్): పగలు, రాత్రి అనే తేడా లేకుండా దొంగలు విజృంభిస్తున్నారు. తాళం వేసిన ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. దొంగతనానికి కాదేది అనర్హమంటూ దేవాలయాలు, బడులను సైతం వదలకుండా అందినకాడికి దోచేస్తున్నారు. కొందరి నిర్లక్ష్యమూ దొంగలకు కలిసొస్తోంది. జిల్లాలో ఐదు సబ్‌డివిజన్లు, 12 సర్కిల్స్ పరిధిలో 52 పోలీస్‌స్టేషన్లు, 11 అర్బన్ పోలీస్‌స్టేషన్లున్నాయి. వీటి పరిధిలో ఏదో ఒక ప్రాంతంలో రోజూ దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని, పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, దొంగతనాలను కట్టడి చేయాలని జిల్లా పోలీస్ బాస్ పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. ఆయన ఆదేశాల అమలు నామమాత్రంగానే ఉంది. క్రైమ్‌పార్టీలూ మొక్కుబడి చర్యలకే పరిమితమయ్యాయి. ఇదే అదునుగా భావిస్తున్న దుండగులు అందినకాడికి దోచేస్తున్నారు. చిన్నపాటి ఆధారం దొరక్కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అంతర్రాష్ట్ర ముఠాలు సైతం జిల్లాలో తలదాచుకుంటూ నేరాలకు పాల్పడుతున్నాయి. గొలుసు దొంగతనాలు పెరుగుతున్నాయి. నెలన్నర వ్యవధిలో రూ.1.50 కోట్లకు పైగా సొత్తును దుండగులు అపహరించారు. తాజాగా కావలిలో పట్టపగలే దొంగలు విజృంభించారు.

నెలన్నర వ్యవధిలో..

- కావలి పట్టణంలోని నాలుగు గృహాల్లో సుమారు 59 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.55 వేల నగదు, 750 గ్రాముల వెండి వస్తువులను దోచుకెళ్లారు.
- కందుకూరు పట్టణం వాసవీనగర్‌లో తాళం వేసిన ఇంట్లో 10 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.2.5 లక్షల నగదు, కొంత వెండి చోరీ చేశారు.
- నారాయణ ఆస్పత్రి ప్రాంగణంలోని వైద్యుల క్వార్టర్స్‌లో 9 సవర్ల బంగారం, ఒకటిన్నర కేజీ వెండి వస్తువులు, రూ.20 వేల నగదు దోచేశారు.
- ఆత్మకూరు పట్టణంలో రమణమూర్తి అనే వ్యక్తి బ్యాగ్‌లోని 100 గ్రాముల బంగారం, వెండిని గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు.
- దుత్తలూరులో నరేష్ అనే వ్యక్తి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు 11 సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు.
- బుజబుజనెల్లూరు ఆర్టీసీ కాలనీలో రాజ్‌కిశోర్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో 10 సవర్ల బంగారు ఆభరణాల చోరీ జరిగింది.

ఇలా చేస్తే..

ప్రజలు ఇళ్లు విడిచి బయటకు వెళ్లే సమయంలో విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉంచరాదు. తెలిసిన వారిని ఇంట్లో ఉండేలా చూసుకోవాలి. ఇంటి ముందు ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే ఆ ఇంటిపై ప్రత్యేక నిఘా ఉంచుతారు. కుదరని పక్షంలో దొంగతనాల నియంత్రణకు పోలీస్ శాఖ రూపొందించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలను వినియోగించుకోవాలి. చాలా సందర్భాల్లో పోలీస్ అధికారులు సూచనలిస్తున్నా కొందరు పెడచెవిన పెడుతున్నారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండటం దొంగతనాలు జరిగేందుకు ఆస్కారమవుతోంది.

పోలీసులూ స్పందించాలి

పోలీస్ అధికారులు నేరాల కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని స్టేషన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్ పెంచాలి. పగలు, రాత్రి బీట్లను పటిష్టంగా అమలు చేయాలి. పాతనేరస్తులతోపాటు జైలు నుంచి విడుదలైన వారు ఎక్కడున్నారు?, ఏం చేస్తున్నారు? అనే వివరాలు సేకరించి వారి కదలికలపై నిఘా ఉంచాలి. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఎవరైనా తిరుగుతున్నారా? అనే సమాచారాన్ని తెలుసుకోవాలి. నిరంతర వాహన తనిఖీలు నిర్వహించాలి. శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలు, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో గస్తీని పెంచాలి. దొంగతనాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రజలనూ భాగస్వాములను చేయడం ద్వారా నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే స్థానిక పోలీసులకు, 112కు సమాచారం అందించాలి.

గడ్డివామి దగ్ధం

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలంలోని జయంపు గ్రామంలో గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైంది. అగ్నిమాపక అధికారుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వీర రాఘవయ్య తన ఇంటికి సమీపంలో గడ్డివామి వేసుకున్నాడు. గురువారం అర్ధరాత్రి ఉన్నట్టుండి వామికి నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.30 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. గిట్టని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టారని, విచారించి న్యాయం చేయాలని పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు.

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 109
లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 220
లేయర్ చికెన్ : 170

నిమ్మ ధరలు(కిలో)

పెద్దవి : రూ.100 సన్నవి : రూ.80
పండ్లు : రూ.50

కండలేరులో 46.108 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 46.108 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 1,390, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ప్రహరీ విషయమై ఇరువర్గాల ఘర్షణ

- ఏడుగురికి గాయాలు
- కేసు నమోదు

జలదంకి: మండలంలోని చామదల గ్రామంలో ప్రహరీ విషయమై ఇరువర్గాలు దాడులు చేసుకోవడంతో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. జలదంకి పోలీసుల కథనం మేరకు.. గ్రామంలో దేవరపల్లి నాగార్జునరెడ్డికి, దేవరపల్లి విష్ణువర్ధన్‌రెడ్డికి ప్రహరీ విషయమై వివాదం నెలకొంది. ఇది పెద్దదై ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. నాగార్జునరెడ్డి వర్గానికి చెందిన నగళ్ల వెంకటేశ్వర్లు, నగళ్ల శీనయ్య, పులి కోటయ్య, సుబ్బమ్మ, విష్ణువర్ధన్‌రెడ్డి వర్గంలో అతడితో పాటు చింతకాయల ప్రసాద్, వల్లూరు వెంకటసుబ్బయ్య గాయపడ్డారు. సమాచారం అందుకున్న కలిగిరి సీఐ వెంకటనారాయణ ఇరువర్గాలతో మాట్లాడారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై లతీఫున్నీసా తెలిపారు.

చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



నెల్లూరులో శిలువను మోస్తున్న బిషప్ ప్రకాశం



సెయింట్ జోసఫ్స్ కేథలిక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా శిలువ మోసి ఏసు ప్రభువు త్యాగాన్ని గుర్తుచేసుకున్నారు.

– నెల్లూరు(బృందావనం)



చర్చి ఆవరణలో క్యాండిల్స్ వెలిగిస్తూ..